మాతృ ప్రేమ

సుందర్రావు ఇల్లు వూరికి కొంచెం పెడగావుంది. అలకా జనం వూళ్లో ఉండలేరు. కాబట్టి వూరికి పెడగా వున్న సుందర్రావు ఇంటిచుట్టూ జానెడు జానెడు స్థలాలు చౌక్కా కొనుక్కొని గుడిసెలు వేసుకొని కాపరం వున్నారు. ఊరు పెరిగినకొందీ వీళ్ళు తమ స్థలాలు అమ్ముకొని కొంచెం దూరంగా మళ్ళీ స్థలాలు చౌగ్గా కొనుక్కొని గుడిసెలు వేసుకొని కాపరం వుంటున్నారు. సముద్రం నురుగుని బయటకి కొట్టినట్టు వీళ్ళని సంఘం ఎప్పటికప్పుడు బయటికి కొడుతూ వుంటుంది. నురుగు ఎట్లా అయితే సముద్రం అంచుల్ని వొదలకుండా వుంటుందో, అట్లాగే వీళ్ళు తమను సంఘం ఎన్ని ఇబ్బందులు పెట్టినా దానిదాని అంచుల్ని పట్టుకొని వొదలకుండా వేళ్ళాడుతూ వుంటారు.

ఈ అలకాజనాన్ని చూస్తే సుందర్రావుకి కోపం, జాలి, భయంవేస్తూ వుండేవి. రోజుకి ఏ నలుగురైదుగురయినా కొట్టుకుంటూ వుండేవాళ్ళు- కొట్టుకోవటం అంటే బండబూతులు తిట్టుకోవటం, కర్రల్తో బాదుకోవటం. వాళ్ళ దెబ్బలాటలుకూడా సుందర్రావుకి విచిత్రంగా వుండేవి. ఒక క్షణం ఎంతో అన్యోన్యంగా నవ్వుతూ, పేలుతూ వుండేవాళ్ళు. మరుక్షణం కర్రలు తీసుకొని బుర్రలు యలక్కాయలకుమల్లే బద్దలు గొట్టుకుంటూ వుండేవాళ్లు. మళ్ళీ ఆ క్షణం గడవగానే యథాప్రకారం నవ్వుతూ పేలుతూ వుండేవాళ్ళు. గొప్పగొప్ప మార్పులన్నీ క్షణాంమీద జరిగిపోతూ వుండేవి.

ఒకరోజు అతను ఇంటికి వొచ్చేటప్పటికి, తన ఇంటి పక్క గుడిసెలో కాపరం వుంటున్న అంజమ్మ నెత్తీ నోరూ కొట్టుకుంటూ ఏడుస్తూ కూర్చుంది? దాని చుట్టూ, చుట్టుపక్కల వున్న జనం అంతా చేరారు. దాని తలమీద గాయం తగిలి నెత్తురు కారుతూవుంది. ఎవరికి చేతనైన సహాయం వాళ్ళు చేస్తున్నారు. సుందర్రావు వాళ్ళ దగ్గరకు వెళ్ళి ఏం జరిగిందని

అడిగితే ఈ విషయాలు తెలిసినై. అంజమ్మ కొడుకు తప్పతాగి వొచ్చి డబ్బు ఇవ్వమని అంజమ్మని అడిగాట్ట. అంజమ్మ ఇవ్వనన్నదట. వాడు కర్రతో అంజమ్మని బాది, అది మొగుడు పోయినప్పటినుంచీ కష్టపడి కూడబెట్టుకున్న పాతిక రూపాయలూ బలాత్కారంగా లాక్కొని వెళ్ళి పోయాట్ట.

ఇట్లాంటి పనులు అప్పుడప్పుడూ సుందర్రావు ఇంటి చుట్టుప్రక్కల జరుగుతూనే వున్నాయిగాని అంజమ్మ వైఖరి అతన్ని ఆకర్షించింది. అంత బాధపడుతూకూడా అంజమ్మ కొడుకుని పల్లెత్తుమాట అయినా అంటంలేదు, పైగా "వాడు తాగివున్నాడు బాబూ! ఏ కారుకింద పడతాడో! ఏ పోలీసోడి చేతుల్లో పడతాడో! పోయి పట్టుకరాండి బాబూ? మీకు పుణ్యముంటాది" అని అందర్నీ కాళ్ళూ, గడ్డాలూ పట్టుకొని బతిమలాడుతూవుంది. "పోతే పోయాడ్లేవే!" అని ఒక పెద్దమనిషి సలహా చెపితే, "నీకేం తెలుసుబాబూ? కన్నకడుపు చేతులమీదగా పెంచాను" అని ఏడ్చింది. అంజమ్మకి కొడుకు మీద వున్న ప్రేమకి ముగ్ధుడయ్యాడు.

ఇంటికి వెళ్ళి ఈ సంగతే ఆలోచిస్తూ పడుకున్నాడు. మాతృప్రేమ ఎంత మహత్తరమైనది? ఎంత నిష్కల్మషమైంది!! ఎంత పవిత్రమైంది!!! ఇలా ఆలోచిస్తూ వుండగానే అతనికి కునుకుపట్టింది........

టకటిక టకటిక అని ధ్వని సూట్‌లోవున్న ఒక మనిషి వొచ్చి అతనిముందు కుర్చీలో కూర్చున్నాడు. అతనికి ఒక కాలు లేదు—కొయ్య కాలు తగిలించి వుంది. మోటించి నడవటానికి చంకలో కర్రవుంది. టక టిక టక అని మోతచేసేది ఆ కొయ్యకాలూ, ఆ చంకలో కర్రా.

అతను వొచ్చీ రావటంతోనే సుందర్రావుకి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చొని, "మీరు మీరేనా?" అని అడిగాడు.

"అవును. నేను నేనే" అన్నాడు సుందర్రావు.

"మీరు నన్ను ఎరుగుదురా?"

సుందర్రావు ఎరగను అన్నట్లు తలవూపాడు.

"ఆహా! నన్ను ఎరక్కపోవటం ఏమిటి? ఆంధ్రదేశంలో నన్ను యెరగనివాళ్ళు లేరే! ఆబాలగోపాలం ఎరుగుదురు" అన్నాడు. అంటూ చంకలోవున్న కర్రతీసి, కుర్చీకి ఆన్చి పక్కనే పెట్టాడు. మెడ అటూ ఇటూ తిప్పి పై కొంచెం వొదులు చేసుకున్నాడు.

సుందర్రావు అతడు ఎవ్వరై వుంటాడా! అని ఆలోచిస్తూ వున్నాడు. ఇన్సూరెన్సు ఏజెంటా? కమ్యూనిస్టా? పుట్టగోడుగా? ఇంతలో అతడే మళ్ళీ ప్రశ్న వేశాడు— "అయితే నన్ను ఎరగనంటావు?"

"ఎరగను"

"పోనీ ఒక సంగతి జ్ఞాపకం వుందా?....ఒకడు వుండేవాడు.... దొంగతనాలు చేసేవాడు....హత్యలుకూడా చేసేవాడు. వాణ్ణి పోలీసువాళ్ళు పట్టుకొని చేసిన పాపాలకు ఉరిశిక్ష వేశారు. వాడు జైల్లో వుండగా వాడి తల్లి 'కొడుకా! కొడుకా!' అంటూ రొమ్ము బాదుకుంటూ వాణ్ణి చూట్టానికి వొచ్చింది. వాడు తల్లిని రహస్యం చెపుతాను రమ్మని దగ్గరకు పిలిచి చెవి కసిక్కున కొరికాడు...."

"జ్ఞాపకం వుంది" అన్నాడు సుందర్రావు. అతని చిన్నతనంలో అంతా ఈ కథ చెప్పుకుంటూ వుండేవాళ్ళు.

"వాణ్ణి నేను" అన్నాడు. అని బిగ్గరగా నవ్వటం మొదలుపెట్టాడు. సుందర్రావుకి ఏమీ తోచలేదు. ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. ఏమి అనాలో తోచక, గుడ్లు వొప్పజెప్పి చూస్తూ వూరుకున్నాడు. అతడు నవ్వి నవ్వి ఆకస్మాత్తుగా సీరియస్ అయిపోయి "తెలిసిందా?" అని అడిగాడు.

"అయితే నువ్వు...."

"స్మశానంలోనుంచి వొస్తున్నాను. ఇంకెక్కడనుంచి వొస్తా. సమాధిలోనుంచి, మేఘానికిమల్లే, మాతృగర్భంలోని పిల్లవాడికిమల్లే, లేచి

వస్తున్నా. ఇవ్వాళ్లే ఈ వూరు చైర్మన్ చచ్చిపోయాడు. వొస్తూ వొస్తూ అతని సూట్ వేసుకొని వొచ్చాను. ఎందుకనోగాని నీ దగ్గరికి సూటుతో రావాలనిపించింది.''

''ఏంపనీ?''అని అడిగాడు సుందర్రావు.

''పని వుంది. నాకీ ప్రపంచంలో ఒక్క మనిషితో పనివుంది. ఆ మనిషికోసం వెతుకుతున్నాను. నా కథ రాసిపెట్టే మనిషి నాకు కావాలి. అందుకు ఎంతమంది దగ్గరకు వెళ్ళాను అనుకున్నావు? రాత్రికి ఒకళ్ళ దగ్గరికి చొప్పున వెళ్తున్నాను. ఏదో తల్లి చెవికొరికానని తప్ప నా పూర్తి కథ అందరికీ తెలియదు. అందరికీ తెలిసేటట్టు చెయ్యాలని నా కోరిక. వ్రాసి పెట్టమని చాలమందిని అడిగాను''

''ఏమన్నారు?''

''కొంతమంది నా కథలో కథావస్తువు లేదన్నారు. కొంతమంది నా కథలో సస్పెన్సు లేదన్నారు. కొంతమంది క్లయిమాక్స్ లేదన్నారు. కొంత మంది ఏమీ చెప్పకుండానే ఇది కథగా రాయటానికి వీల్లేదు అన్నారు. తిరిగి తిరిగి నీ దగ్గరకు వొచ్చాను.''

''నాకు మాత్రం చాతనవుతుందని నువ్వు ఎట్లా అనుకున్నావు?''

ఈ ప్రశ్నకు అతనిమొహం విప్పారింది. చేత్తో మీసాలు సర్దుకొని కుర్చీ కొంచెం ముందుకు లాక్కొని. ఏదో పరమరహస్యం చెపుతున్న వాడికిమల్లే చెప్పాడు—కారణం వుంది. ఆచైర్మన్ చెప్పాడు. వొచ్చిన రోజే తన సమాధిలో కూర్చుని నిన్ను నోటికి వచ్చినట్లు తిడుతున్నాడు. బతికివున్న రోజుల్లో అతనిమీద నువ్వేదో కథ రాశావటగా! నీ కథలో కథా వస్తువే వుండదట! సస్పెన్సే ఉండదట! క్లయిమాక్స్ పెట్టటం అసలు నీకు చేతగాదట! ఇవన్నీవింటూ వుంటే నాకు చాలా సంతోషం వేసింది. నాకు తగ్గవాడు నేటికి దొరికాడు అనుకున్నాను. రంయిన బయలుదేరి వొచ్చే శాను—నీ దగ్గరికి....మరి నాకథ వింటావా?''

"చెప్పూ" అన్నాడు సుందర్రావు. అతనిక్కూడా అతని కథ వినాలని కుతూహలంగా ఉంది.

అతడు మొదలు పెట్టాడు.

"మా అమ్మకీ నాన్నకీ నేనే సంతానం. మాఅమ్మకి నేనంటే చాలా గారాబం. నన్ను కిందకు దింపకుండా పెంచింది. నాకు చిన్నతనంలో చాలా జబ్బులు చేస్తూవుండేవట. దీనికి మా అమ్మే కారణం అని మానాన్న నేను పెద్ద వాణ్ని అయింతర్వాతకూడా తిడుతూవుండేవాడు. ఎప్పుడూ చేతుల్లోపెంచటం, కిందికిదిగి ఆడుకోనివ్వకపోవటం, నేనుకావాలన్నదల్లా కాని ఇవ్వటం, బలవటంలేదని కాకిమీదా కుక్కమీదాపెట్టి వొద్దని ఏడుస్తున్నా వినకుండా, మరిపించి అన్నం పెట్టడం ఇవన్నీ నా అనారోగ్యానికి కారణం అనీ, నా జీవితాన్ని నాశనం చేసింది మా అమ్మే అని మా నాన్న ఆమెను తిడుతూవుండేవాడు. అప్పుడు ఆయన మాటలు నాకు అర్థం అయ్యేవి కావు. మా అమ్మకి నేనంటే ఉన్న ప్రేమా, ఆవిడ నన్ను పెట్టేగారాబం చూస్తూవున్న నాకు మానాన్న మాటలకు చాలా కోపం వొచ్చేది. నాకు చిన్నబిడ్డ గుణం వొచ్చింది. ఇదిగో చూడూ, వాళ్ళంతా కాల్చారు దీనిక్కూడా మా అమ్మే కారణం అంటూ ఉండేవాడు నాన్న.

కాని మాఅమ్మ ఆయనమాటలను లెక్కపెట్టేదికాదు. ఆయన అనేది అంటూనే ఉండేవాడు. ఆమె చేసేది చేస్తూనే ఉండేది.

నేను కొంచెం పెరిగిన తర్వాతకూడా వాళ్ళిద్దరూ నా విషయంలో పోట్లాడుకుంటూనే ఉండేవారు. మానాన్న నన్ను బళ్ళోకి వెళ్ళమని కొడితే అమ్మ ఓర్చుకోలేక కళ్ళవెంట నీళ్ల పెట్టుకుంటూ "వాణ్ణిమీరు బతకనివ్వరు" అని పోట్లాడేది. నాన్న బయటకు వెళ్ళగానే అవీ ఇవీ కొనిపెట్టి "బళ్ళోకి వెళ్ళకపోతే పోన్లే నాయనా, ఇంట్లోనే ఉండు" అని బుజ్జగించేది. మానాన్న సాయంకాలం వచ్చి అడిగితే బడికి వెళ్ళివొచ్చాడని చెప్పేది. ఇప్పటిదాకా చదువుకొని ఇప్పుడే కన్నుమూశాడు, అనికూడా చెప్పేది. ఇట్లా జరుగుతుండగా నాన్న కాలంచేశాడు."

అతను కథ చెప్పే పద్ధతి సుందర్రావుకి నచ్చలేదు. అసలు కథ కూడా అతనికి ఏమంత బాగాలేదు. అయినా చేసేదిలేక వింటున్నాడు.

"ఇంకేముంది? నాన్న చచ్చిపోగానే నాకు స్వరాజ్యం వొచ్చింది. చేతినిండా డబ్బువుంది. వంట్లో సత్తువవుంది. అప్పుడు ఇట్లా ఉండేవాణ్ణా? బజార్న నడుస్తుంటే ఆడవాళ్ళ వాకిళ్ళలో నిలబడి ఏం చూసేవారు? కొద్ది కాలంలోనే నాకు చెడుసావాసాలూ, దురభ్యాసాలూ, ఎక్కువైనై. ఒక తాగుడేనా? ఒక్క ముండలేనా?— సమస్తం అలవాటు పడ్డయ్....డబ్బు విచ్చలవిడిగా ఖర్చు పెట్టటం సాగించాను. నేను ఎక్కడ కష్టపడతానో, కోపం వచ్చి ఏంచేసుకుంటానో అని అమ్మకూడా ఏమీ అనేదికాదు. ఎవ్వరయినా, ఏమైనాచెప్పినా "అంతా వొట్టిది–నా బిడ్డబంగారం–గిట్టనివాళ్ళు వేసేమాటలు" అని పోట్లాడేది. లోలోపల మాత్రం "పెళ్ళి అయితే వాడే బాగుపడతాడు" అని సమాధానపరుచుకుంటూ వుండేది. ఈ వుద్దేశంతోనే నాకు పెళ్ళి చేసింది. నేను మొదట్లో పెళ్ళి చేసుకోనని చాలా పట్టుపట్టాను. ఎందుకంటే అప్పటికే నా వొళ్ళంతా గుల్ల అయింది. నేను ఎంతచెడ్డా అప్పటికి ఇంకానాలో మానవ స్వభావం పూర్తిగా నాశనం కాలేదు. నేను ఎన్ని చెప్పినా నామాట అమ్మ వినలేదు. "నేను పెంచాను– పెద్దవాణ్ణి చేశాను. నీమీద కళ్ళుపెట్టుకొని బతుకుతున్నాను." అని ఆమె బతిమలాడుతూ వుంటే నేను ఆమె మాటకు ఎదురు చెప్పలేక పోయాను. లొంగిపోయాను. ఆమె సుఖంకోసం, ఆమెను తృప్తిపరచటానికి పెళ్ళిచేసుకున్నాను.

కాని నా పెళ్ళి అయింతర్వాత ఏమి అయిందనుకున్నావ్? నా భార్య కాపరానికి వొచ్చిందగ్గరనుంచీ దానిపొత్తు మా అమ్మకు గిట్టేదికాదు. దాన్ని చూస్తేనే చురచురలాడేది. చీటికీ మాటికీ కజ్జా పెట్టుకునేది నా భార్య చాలా మంచిది. మా అమ్మ ఏమన్నా ఎదురు చెప్పేదికాదు. అయినా మాఅమ్మ దాన్ని మంచానపెట్టి రంపానకోసేది, మే మిద్దరం కలసివుంటే సహించేది కాదు. ఏదో వంకపెట్టి దాన్ని పిలిచేది– పడపడా తిట్టేది. నేను ఇంటికి రాగానే దానిమీద నానా పితూర్లూ చెప్పేది.

నేను మొదట్లో మా అమ్మ మాటలన్నీ నమ్మాను. దాన్ని అనేక

పొర్లు కొట్టాను. చివ్వరికి ఇంటిలోనుంచికూడా వెళ్ళగొట్టాను. అప్పుడు మా అమ్మ ప్రవర్తననాకు అర్థం కాలేదు. తరువాత తరువాత ఆలోచించుకుంటే తెలిసింది. కాని ఏమిలాభం? అప్పటికి అవాల్సిందంతా అయిపోయింది" అని ఒక్కనిట్టూర్పు విడిచాడు.

సుందర్రావు వింటూ కూర్చున్నాడు. అతను కొంచెం సేపు వుండి "మా అమ్మ ప్రవర్తనలో మార్పుకి కారణం ఏమిటంటావ్?" అని అడిగాడు సుందర్రావుని.

"నేనేం చెపుతాను? నువ్వేచెప్పు?" అన్నాడు సుందర్రావు.

"కారణం ఉంది. అప్పట్లో నాకు తెలియదు. యదార్థం కాకపోతే నామీద ఇంత ప్రేమగా వుండే అమ్మ ఇవన్నీ ఎందుకు చెపుతుంది? అనుకున్నాను కాని కారణంవేరు."

"ఏమిటి?"

"అప్పటిదాకా నన్ను మా అమ్మ తన సొంత ఆస్తిగా చూచుకునేది. నేనూ, తనూ అంతే అనుకునేది. కాని అకస్మాత్తుగా మరొకమనిషి, కొత్త మనిషి, కనిపెంచని మనిషి, నా జీవితంలోకివొచ్చి, నా నాజీవితంలో భాగం పంచుకోవడం మొదలు పెట్టేటప్పటికి ఆమె ఓర్చలేక పోయింది. నా భార్య తన్నేదో అన్యాయం చేస్తున్నట్టు తన వస్తువుని దోచేస్తున్నట్టు బాధ పడింది. దాన్తో నా భార్యమీద కోపం, వైరం పెంచుకుంది. ఆమెకు తెలియకుండానే మారిపోయింది. ఆమె మాతృప్రేమ దీనికి కారణం." అని కర్ర చేతిలోకి తీసుకొని ఒకసారి నేలకుకొట్టి పై సర్దుకొని కూర్చున్నాడు. కాలం గడిచిపోతూవుంది. కాని అతడు ఇక మాట్లాడదలచినట్టు కనపడలేదు. అలాగే కూర్చున్నాడు.

"తరువాత ఏమయింది?" అని అడిగాడు సుందర్రావు.

అతడు వులిక్కిపడి సర్దుకొని ఇలా చెప్పాడు "ఇక అనటానికి యేముంది? నా భార్య వెళ్ళిపోయింతర్వాత నా పని మరీ అధ్వాన్నమయింది. తాగుడూ, తిరుగుడూ ఎక్కువైనై. కొద్దిరోజుల్లోనే ఇల్లంతా గుల్లయింది. దొంగతనాలు మొదలు పెట్టాను. చివరికి పోలీసులు నన్ను పట్టుకోవటం ఉరిశిక్ష వెయ్యటం మీ కందరికీ తెలిసిందే! నేను జైల్లోవుండగా అమ్మ

నన్ను చూట్టానికి వొచ్చింది హృదయం తరుక్కుపోయేటట్టు ఏడ్చింది. కాని నాకు ఆమె మీద జాలి కలగలేదు. నా స్థితికి ఆమే — ఆమె మాతృప్రేమ — కారణంఅని అప్పటికి నాకు నమ్మకం కలిగింది. రహస్యం చెబుతాను రమ్మనమని దగ్గరకు పిలిచాను. చెవి దగ్గరకు వొంగింది. చెవి కసిక్కిన కొరికాను."

"ఏమో!"

మళ్ళీ అతడు మాట్లాడకుండా కూర్చున్నాడు. కొంచెంసేపు అయిం తర్వాత నెమ్మదిగాలేచి కర్ర చంకకిందపెట్టి "మరి నా కథ రాస్తావా?" అని అడిగాడు.

"ఇదేనా కథ" అని అడిగాడు సుందర్రావు.

"ఇదే, ఏం? కథకి పనికిరాదూ?" అని అతడు తీక్షణంగా చూసి అడిగాడు.

"ఎట్లా ఇది కథగా రాయటం?"

టకటక శబ్దం చేసుకుంటూ రెండు అడుగులు ముందుకు వేసి "ఏం ఇందులో సస్పెన్సు లేదూ? క్లయిమాక్సు లేదూ? డ్రెమెటిక్ బిగినింగ్ లేదూ? లేకపోతే పెట్టు. నీయిష్టవచ్చినవన్నీ పెట్టు. కాని కథరాయి. మాతృప్రేమలో పవిత్రం కానీ, ఔన్నత్యంగానీ, స్వార్థం లేకపోవడంగానీ, ఏమీలేదని లోకానికి చాటు. అది పశు లక్షణంగా బోధించు. అది అగ్నికంటే భయంకరమైందనీ, అందర్నీ, ప్రేమించేవాళ్ళనీ, ప్రేమకు గురి అయిన వాళ్ళనీ అందర్నీ నాశనం చేస్తుందనీ చెప్పు. ఏం? కథ రాస్తావా?

సుందర్రావుకి అతన్ని చూస్తే భయం వేసింది. కోపంతో అతను వొణికిపోతున్నాడు. కళ్ళు యెర్రబడ్డాయి. అదంతా చూచి "రాస్తాను" అన్నాడు సుందరరావు.

"సెభాష్! నువ్వు మంచివాడివి" అని అతను సుందర్రావు వీపు తట్టాడు. సుందర్రావు నిద్రనుంచి ఉలిక్కిపడి లేచాడు. పక్కగుడిసెలోని అవ్వ 'కొడుకా! కొడుకా!' అని యింకా ఏడుస్తూనేవుంది.